క్లుప్తంగా

ప్రతి ఇంటా ఆనందాలు నిండాలి



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాలు నింపాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. చీకటిమీద వెలుగులు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకొంటామని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రజలందరికీ శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని అభిలషించారు.

'ధర్మవరం' సినిమాను ఆదరించండి



మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పతో సినిమా టీం

పావగడ: పట్టుచీరలకు ప్రసిద్ధి చెందిన 'ధర్మవరం' పేరుతో చేనేత కార్మికుల సమస్యల నేపథ్యంలో తీసిన సినిమాను అందరూ ఆదరించాలని చిత్ర కథానాయకుడు రాజు వెంకట్ కోరారు. పట్టణంలోని రామాంజనేయ వే బ్రిడ్జ్ ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడారు. దీపావళికి సినిమా విడుదల అవతుందని తెలిపారు. తాలూకాలోని తిరుమణి గ్రామానికి చెందిన సినీ హీరో రాజు వెంకట్ ఆంధ్రలో స్థిరపడి చిత్రసీమలో రాణిస్తున్నాడు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, మానం వెంకటస్వామి, సొగడు వెంకటేష్, మైలారరెడ్డి తదితర నాయకులతో పాటు చిత్రం యూనిట్ పాల్గొంది.

ధర్మవరం డ్యాన్సర్లకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న ధర్మవరం రాకింగ్ స్టార్స్ మాస్టర్లు, విద్యార్థులు

ధర్మవరం అర్బన్: హైదరాబాద్ రవీంద్రభారతిలో నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా లెవెల్ డ్యాన్స్ మ్యూజిక్ పోటీల్లో ధర్మవరం రాకింగ్ స్టార్స్ డాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి అవార్డులు కైవసం చేసుకున్నారు. రాకింగ్ స్టార్స్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు అమాన్, దిలీప్, భవిష్, యశశ్విని, యామిని, నిషికశ్రీ, హైందవి ప్రియ, వరుణ్, వివేక్‌లు నటరాజ, నందీశ్వర్ అవార్డులు, నాట్య మయూరి అవార్డులు సొంతం చేసుకున్నారని డ్యాన్స్ మాస్టర్లు అస్లామ్, లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: గోపేపల్లి సమీపాన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లసింగయ్యగారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అరుణ్‌కుమార్ (19) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కాలనీకి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కంది పంట కళకళ

కనగానపల్లి: ఖరీఫ్ సీజన్‌లో మెట్ట భూములలో సాగు చేసిన కంది పంట ఇటీవలి వర్షాలకు కళకళలాడుతోంది. రాప్తాడు నియోజకవర్గంలోని పలు మండలాల్లో కంది పంట ఎక్కువగా సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు పది వేల ఎకరాల్లో కంది పంట సాగుచేయగా, ఒక్క కనగానపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా సాగైంది. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే దిగుబడి బాగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కాగా.. ఈ దశలో పంటకు వ్యాపించే తెగుళ్ల నివారణకు రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యం



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను విడుదల చేస్తున్న దుద్దుకుంట, నాయకులు



'రచ్చబండ'లో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు : స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పనిచేయాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే మునిసిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి సెమిఫైనల్ మ్యాచ్ లాంటివని, ఈ మ్యాచ్ ఇచ్చే ఉత్తేజంతో ఫైనల్ మ్యాచ్ సనాయసంగా గెలవచ్చని తెలిపారు. మండలంలోని 14/14 పంచాయతీలతో పాటు ఎంపీపీ స్థానాన్ని సైతం కైవసం చేసుకోవాలన్నారు. ఆదివారం మండలంలోని టి.కుంట్లపల్లి, వెంకటాపురం, ఇనగలూరు, మిట్టపల్లి గ్రామాల్లో 'వైఎస్సార్‌సీపీ రచ్చబండ', అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గ్రామ కమిటీ, అనుబంధ కమిటీలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ఓడీచెరువు మండల అబ్జర్వర్లుగా సూర్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, టి.కుంట్లపల్లి అబ్జర్వర్‌గా సూర్యనారాయణరెడ్డి, వెంకటాపురం అబ్జర్వర్‌గా యర్రగుంట్ల సోమశేఖర్‌రెడ్డి, మిట్టపల్లి అబ్జర్వర్‌గా మాధవ రెడ్డిని నియమించినట్లు దుద్దుకుంట తెలిపారు. కమిటీలకు ఎంపికై న వారు బాధ్యతగా పని చేయాలని కోరారు. 18 నెలలకే కూటమి పాలనతో జనం విసిగిపోయారన్నారు. గంజాయి, పేకాట, నకిలీ మద్యం, అక్రమ ఇసుక రవాణా కూటమి నాయకుల ప్రధాన ఆదాయ వనరులుగా మారాయని విమర్శించారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి 'పల్లె' కుటుంబం చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మూడు నేషనల్ హైవేలు, ఒక్క ఎక్స్‌ప్రెస్ హైవే, 193 చెరువులకు నీరు నింపేందుకు జీఓతో పాటు రూ.864 కోట్లు మంజూరు చేయించానని దుద్దుకుంట చెప్పారు.

కూటమి నాయకుల జేబు నింపేందుకే పీపీపీ

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు వైద్య విద్య అందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకునా వాలనే లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీలు తీసుకొస్తే.. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు సీఎం చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టి, కూటమి నేతల జేబు నింపేందుకు పూనుకున్నారని దుద్దుకుంట దుయ్యబట్టారు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజునాయుడు, కుర్లి నర్సిరెడ్డి, సతీష్‌రెడ్డి, అంజినప్ప జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంత రెడ్డి, మధుసూదన్ నాయుడు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, ఎల్లేశ్వర్, రమేష్ నాయక్, కుర్లి రంగారెడ్డి, రఫీ, చెన్నారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



లోకనాథరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: లింగారెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రగిరి లోకనాథరెడ్డి రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం లోకనాథరెడ్డి కుటుంబాన్ని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రం నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి.. ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆ తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న గుర్రం పరమేశ్వరరెడ్డిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం ఈశ్వరయ్య, గుర్రం శ్రీనివాసరెడ్డి, కోటి సురేష్, షరాబ్ యోగానంద ఆచారి, సాకే సురేష్, మినమనూరి లోకేష్, బిల్లే సూరి, బిల్లే వెంకటనారాయణ, బొంతల నారాయణస్వామి, బొంతల ప్రతాప్, బొంతల రాఘవ తదితరులు ఉన్నారు.

డాక్టర్ రవీంద్రారెడ్డికి ఘన నివాళి



డాక్టర్ రవీంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

కదిరి టౌన్: కదిరిలో పేదల డాక్టర్‌గా పేరొందిన దివంగత రవీంద్రారెడ్డికి వైద్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ రవీంద్రారెడ్డికి ఐఎంఏ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. తొలుత డాక్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ అందించిన సేవలు, వారి రాజకీయ ప్రస్థానం, డాక్టర్ రవీంద్రారెడ్డి భార్య డాక్టర్ ప్రమీల కొనసాగిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు రమణయ్య, శ్రీనివాసులు, శంకరయ్య, సి.వి.మదనకుమార్, నాగేంద్రకుమార్‌రెడ్డి, నాగరాజు, ఐఎంఏ కదిరి అధ్యక్షుడు డాక్టర్ అజాద్, జానకీరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మావతిబాయి, భారతి, స్మిత, సతీష్‌కుమార్, ఆశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



టపాసుల విక్రయదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రాలను ఆదివారం డీఎస్పీ పరిశీలించారు. ప్రతి షాపూ లైసెన్స్ కలిగి ఉండాలని, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీపావళి పండుగను పరజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

టపాసుల దుకాణం తనిఖీ

చెన్నేకొత్తపల్లి : దీపావళి పండుగను పురస్కరించుకుని చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాన్ని రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, పీఎస్ఐ గౌతమి ఆదివారం తనిఖీ చేశారు. దుకాణం సమీపంలో డ్రమ్ములలో నీటిని, ఇసుకను తప్పనిసరిగా ఉంచాలని లైసెన్స్ దారుడు షేక్ సోహెల్‌కు సూచించారు. దుకాణం పరిసర ప్రాంతాల్లో పొగ తాగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



పూజలందుకుంటున్న మరూరు వసికేరప్పస్వామి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తదితరులు

బత్తలపల్లి: లింగారెడ్డిపల్లిలో శనివారం రాత్రి బొంతల వంశస్తుల ఆధ్వర్యంలో కొడిమి కల్లుమడప్పస్వామి, మరూరు వసికేరప్పస్వామిల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బొంతల ఈశ్వరయ్య, పావని దంపతులు తమ స్వగృహం నుంచి స్వామిని గ్రామంలో ఊరేగించారు. పూజారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు నారికేళాలు సమర్పించారు. ఆదివారం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు యోగానంద ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం నరసింహారెడ్డి, బిల్లే సూరి, వెంకటనారాయణ, పూజారి కల్లుమడప్ప, పూజారి మహేష్, బొంతల నారాయణస్వామి, వీరనారప్ప, కేశవ, బొంతల ప్రతాప్, బొంతల రాఘవ, హరి, రమేష్, సురేష్, రామకృష్ణతో పాటు వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు బస్సులతో వ్యాపారులకు నష్టం'



దుకాణాలు కనిపించకుండా ప్రైవేట్ బస్సు అడ్డంగా నిలిపి, బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో తమ దుకాణాల ముందు ఎస్ఎల్ఎస్ ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు రోజూ గంటల తరబడి నిలుపుతుండటంతో వ్యాపారాలు జరగక ఇబ్బందులు పడుతున్నామని, అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితికి వచ్చామని పలువురు దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కదిరి నుంచి హెచ్ క్రాస్, హొసకోట, వైట్ ఫీల్డ్, అత్తిబెలి మీదుగా ఎలక్ట్రానిక్ సిటీకి రాకపోకలు సాగించే ఈ బస్సుకు అనుమతులు లేకపోయినా నడుపుతున్నారని ఆరోపించారు. వీటి కారణంగా ఆ రూట్‌లో తిరిగే రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా రద్దయ్యాయని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌కి 500 మీటర్ల దూరంలోపు ప్రైవేట్ వాహనాలు ఉంచరాదన్న నిబంధనలు ఉన్నా బేఖాతరు చేస్తున్నారన్నారు. ఆర్టీసీ, రవాణా అధికారులు స్పందించి అనధికారికంగా తిప్పుతూ.. గంటల తరబడి పార్కింగ్ చేస్తున్న ప్రైవేట్ బస్సులపై చర్యలు తీసుకుని, తమ వ్యాపారాలు సాఫీగా సాగేలా సహకరించాలని కోరుతున్నారు.

గుండెపోటుతో పురోహితుడు మృతి



విజయ్‌కుమార్‌శర్మ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నివసిస్తున్న అర్చక పురోహితుడు ఎర్రబల్ల విజయ్‌కుమార్ శర్మ (51) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు భార్య ఆశ, కుమార్తెలు శ్రేయ, జ్ఞానశ్రీత ఉన్నారు. విజయకుమార్ శర్మ మృతి పట్ల పట్టణంలోని బ్రాహ్మణులు, గాయత్రి సంఘం, అర్చక సంక్షేమ సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివనారాయణస్వామి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ వెంకటశివనారాయణస్వామి ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాడి ఆవు మృతి

తనకల్లు: ముండ్లవారిపల్లిలో ఓ పాడి ఆవు ఆదివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. సతీష్ అనే రైతుకు చెందిన పాడి ఆవు అనారోగ్యానికి గురైతే పశు వైద్యుడు గోపాల్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లాడు. తాను అందుబాటులో లేనని, గోపాలమిత్ర వెంకటేష్‌ను పంపుతానని వైద్యుడు తెలిపారు. గోపాలమిత్ర వెంకటేష్ గ్రామానికి వచ్చి ఆవును పరిశీలించి చికిత్స అందజేశాడు. గోపాలమిత్ర ఇంజెక్షన్ వేసిన కొద్దిసేపటికే ఆవు కాలు వాపు వచ్చి మృతి చెందింది. పాడి ఆవు మృతితో రూ. 1.20 లక్షల నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు. పశువైద్యులు అందుబాటులో లేకుండా గోపాలమిత్రను పంపి అరకొర వైద్యం చేయించడం వల్లే తన ఆవు మృతి చెందిందని ఆరోపించాడు. తన కుటంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

23న సర్వసభ్య సమావేశం

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

అనుచితంగా ప్రవర్తించవద్దు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి: మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమశేఖర్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మండలంలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లను, నేరాలకు పాల్పడిన వారితో బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో సమావేశమై ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, దాడి చేయడం, లైంగికంగా వేధించడం, మరే రకంగా ఇబ్బంది పెట్టడం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సమావేశంలో ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు

ముదిగుబ్బ: గరుగుతండాలో ఆదివారం కార్డన్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ శ్యామరావు, తాడిమర్రి, పట్నం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. అనంతరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, పోక్సో, అక్రమ మద్యం, బాల్య వివాహాలు, డయల్ 100, 1930 తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా వుండాలని వారు సూచించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రజిన్నన్నగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కేశన్న(54) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, క్రిష్ణమూర్తి, సుబ్బిరెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని కేశన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శికి సన్మానం



అగిలే శంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అగిలే శంకర్‌రెడ్డిని సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. శంకర్‌రెడ్డి గతంలో కృష్ణ అభిమాన సంఘంలో పనిచేశారు. వైఎస్సార్ సీపీ ఏర్పాటయ్యాక అందులో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో ఆయన కృషిని గుర్తించి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చోటు కల్పించడంతో కృష్ణ అభిమాన సంఘం నాయకులు ధర్మవరానికి చెందిన గూండా ఈశ్వరయ్య, శ్రీరాములు, బాషా, మద్దులచెర్వు గోవింద్ తదితరులు ఆదివారం తాడిమర్రిలోని శంకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శాలువా కప్పి, సన్మానించారు. కార్యక్రమంలో నాగరాజు, రమణ పాల్గొన్నారు.

నేడు రచ్చబండ, కోటి సంతకాల సేకరణ

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలో 'రచ్చబండ', కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు పెమనకుంటపల్లి తండా, 9.30కు కురుమాల, మధ్యాహ్నం 1.30కు గోపేపల్లి, 3 గంటలకు వంకరకుంటలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ ఉంటుందని నాయకులు తెలిపారు.

తిమ్మమ్మకు ప్రత్యేక పూజలు

ఎన్‌పీకుంట: గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మమర్రిమానును ఆదివారం ఐజీ కార్యాలయ ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. తిమ్మమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌పీ కుంట ఏఎస్ఐ కిశోర్‌రెడ్డి, గాండ్లపెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యకాంతుల దీపావళి

- కొనుగోలుదారులతో టపాసుల దుకాణాల కిటకిట



పుట్టపర్తిలో టపాసులు కొనుగోలు చేస్తున్న పిల్లలు

పుట్టపర్తి టౌన్: దుష్ట శక్తులను పారదోలి కొత్త జీవితానికి స్వాగతం పలికే దివ్యకాంతుల పండుగ దీపావళి. సోమవారం పండుగను జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు, నియోజకవర్గాల్లో టపాసుల కొనుగోళ్లకు ప్రజలు పోటెత్తారు. అయితే టపాసుల ధరలు భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం అధికంగా పెరిగాయని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఇసాక్, కేశవ నాయుడులను సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తి: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలైన మాణిక్యం ఇసాక్, కేశవనాయుడులను కొత్తచెరువు బాలుర ఉన్నతపాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. అంకితభావంతో పనిచేసినందుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయని ఏపీటీఎఫ్ కార్యదర్శి ఆర్.చంద్ర, ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు పీవీ మాధవ్ పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఏపీటీఎఫ్ పుట్టపర్తి జోనల్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, సాయి శివ, భాస్కర్ నాయుడు, కిలారి హరి తదితరులు పాల్గొన్నారు.